క్లుప్తంగా

## 28న యాదవ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

తెనాలి: యాదవ ఎంప్లాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గంలో పదో తరగతి ఉత్తీర్ణులైన యాదవ విద్యార్థులకు ఈ నెల 28న ప్రోత్సాహకాలను అందించనున్నట్టు నిర్వాహకులు ఎనికేపల్లి అంబరీషుడు, అంగిరేకుల వెంకటప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటకు స్థానిక రైల్వే స్టేషను రోడ్డులోని బృందావనం హోటల్‌లో జరిగే ఈ సమావేశంలో డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, డాక్టర్ తాడిబోయిన అవినాష్, డాక్టర్ ఎనికేపల్లి అనిల్‌కుమార్, డాక్టర్ నల్లమేకల శివరామకృష్ణ, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, యాదవ రాజకీయ పెద్దలు పాల్గొంటారని తెలిపారు. తెనాలి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 10వ తరగతి పాసైన యాదవ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 81217 53512, 79816 07117 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఇదే సభలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు కెరీర్ గైడెన్స్ ఇస్తారని పేర్కొన్నారు.

## కళాకారిణి రత్నరాణికి సత్కారం



తెనాలి: ఎన్టీ రామారావు శత జయంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటరులో గురువారం గజదొంగ సినిమాను ప్రదర్శించారు. ప్రముఖ కళాకారిణి, గాయని, పద రచయిత్రి మోదుకూరు రత్నరాణిని థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. గుంటూరులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజ్ చైర్మన్ కోయ సుబ్బారావు, శతాబ్ది ఉత్సవ కమిటీ కోశాధికారి సోమవరపు నాగేశ్వరరావు, తాడిబోయిన హరిప్రసాద్, కాకుమాను కనకరాంబాబు, శాఖమూరి చిన్న, కోనేరు కుటుంబ రావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ ఆవుల చక్రవర్తి, కొండముది రమేష్ పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీ హెనాప్రియ



తెనాలిరూరల్: తెనాలి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సిద్దెల హెనాప్రియ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.రవిబాబు జూన్ 14 వరకు వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లారు. దీంతో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న హెనాప్రియకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ..అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## నాటు సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

నగరం: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. పరిశావారిపాలెంలో నాటుసారా విక్రయిస్తున్న మహిళను గురువారం సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వివరాలు వెల్లడించారు. శిరిపూడి శివారు పరివారిపాలెంలో ఏమినేని వెంకటేశ్వరమ్మ అనే మహిళ నుంచి రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వెంకటేశ్వరమ్మను అరెస్ట్ చేసి, రేపల్లె సబ్ కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా.. నాటుసారా విక్రయాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు

కర్లపాలెం: మహిళ అదృశ్యమైన ఘటన చింతాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. చింతాయపాలెం గ్రామానికి చెందిన ప్రకాష్‌బాబు అలియాస్ యాకోబు కుమార్తె 24ఏళ్ల గొర్రుముచ్చు అరుణకు 2020లో వివాహమైంది. అనంతరం ఆరు నెలలకు భర్తతో విడాకులు తీసుకుని తండ్రి వద్దే ఉంటోంది. మానసికంగా ఆరోగ్యం సరిగా లేని అరుణ.. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఈ క్రమంలో అరుణ తండ్రి ప్రకాష్‌బాబు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అరుణ ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 94409 00870 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శివయ్య కోరారు.



# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి జవసత్వాలు

- అన్ని విభాగాల్లో స్పెషలిస్టు పోస్టుల భర్తీ
- కొత్తగా సైకియాట్రిస్ట్ నియామకం
- అందుబాటులోకి ఫిజియోథెరపీ విభాగం
- 40 నుంచి 62కు పెరిగిన ల్యాబ్ పరీక్షలు



ఆసుపత్రిలో నెలకొల్పిన పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంటు



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

తెనాలి: తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇప్పుడు పూర్తిస్థాయిలో రోగులకు సేవలను అందిస్తోంది. వైద్య రంగంపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ, జాతీయ ఆరోగ్య మిషన్ సహకారంతో ఆసుపత్రి జవసత్వాలను సంతరించుకుంది. తగిన సౌకర్యాలు, వైద్య పరికరాలు, స్పెషలిస్టు పోస్టులకు వైద్యుల భర్తీతో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే అందుబాటులోకి వచ్చాయి. రోగుల ఆదరణతో పాటు ఆసుపత్రికి క్వాలిటీ సర్టిఫికెట్ లభించటం మరో విశేషం.

**గత పరిస్థితి ఇదీ..**

అంగట్లో అన్నీ ఉన్నా..అల్లుడు నోట్లో శని.. అన్న చందంగా, విశాలమైన భవన సముదాయంలో గల తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కొన్నేళ్లుగా విమర్శలకు గురవుతూ వచ్చింది. ఆసుపత్రికి అనుబంధంగా తల్లీపిల్లల వైద్యశాల ఉంది. ప్రసూతి వైద్య సేవలు, ఆర్థోపెడిక్ వైద్యం మినహా మిగిలిన విభాగాల్లో స్పెషలిస్టు వైద్యులు లేకపోవటం నుంచి వైద్య పరికరాలు, సిబ్బంది కొరతతో రోగులకు తగిన వైద్య సేవలు అందని పరిస్థితి. ఇదంతా గతం.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగంపై తీసుకున్న శ్రద్ధతో ఆసుపత్రి పనితీరు పూర్తిగా మారిపోయింది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తెనాలిలోని జిల్లా ఆసుపత్రి కరోనా రోగులకు సమర్థవంతంగా చికిత్సలు అందించింది. కరోనా తీవ్రత తగ్గాక ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంది. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయ అధికారుల పర్యవేక్షణ, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో అన్ని రకాల మౌలిక వసతులు సమకూరాయి. అన్నీ విభాగాల్లో స్పెషలిస్టు వైద్యుల పోస్టులను భర్తీ చేశారు. గతంలో ఎన్నడూ చూడని సైకియాట్రిస్ట్ ఇప్పుడు వైద్య సేవలు అందిస్తున్నారు. పూర్తిస్థాయి ఆధునిక వైద్య పరికరాలతో ఫిజియోథెరపీ యూనిట్ నడుస్తోంది.

**పెరిగిన సేవలు, రోగులు**

వసతులు, వైద్య నిపుణుల రాకతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. రోజుకు 500–600 మధ్య ఉండే ఔట్ పేషెంట్ల సంఖ్య ఇటీవల రెట్టింపయింది. 200 పడకలు కలిగిన ఈ ఆసుపత్రిలో కరోనా సమయంలో పెరిగిన రద్దీతో పడకల సంఖ్యను 300లకు పెంచారు. ప్రస్తుతం ఇన్ పేషెంట్ల సంఖ్య రోజూ 120–140 వరకు ఉంటోంది. ఈసీజీ పరీక్షలు 40–50 వరకు ఉంటున్నాయి. జనరల్, గర్భిణులకు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలు హీన పక్షం 60 వరకు చేస్తున్నారు. ఎక్స్‌రే 75, ఎంఆర్ఐ స్కానింగ్ 15 వరకు తీస్తున్నారు. బ్లడ్ బ్యాంక్ నుంచి రోజుకు 8 నుంచి 10 యూనిట్ల రక్తాన్ని అవసరమైన రోగులకు అందిస్తున్నారు.

**ఆక్సిజన్ ప్లాంట్ సామర్థ్యం పెంపు..**

ల్యాబ్ పరికరాలు, రీ ఏజెంట్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో కేవలం 40 రకాల పరీక్షలు మాత్రమే చేసేవారు. ప్రస్తుతం 62 రకాల పరీక్షలు, మైక్రోబయాలజీ పరీక్షలు చేయగలుగుతున్నారు. ఆక్సిజన్ ప్లాంటు సామర్థ్యాన్ని 10 కిలో లీటర్లకు పెంచటమే కాకుండా, కొత్తగా గాలి నుంచి ఆక్సిజన్‌ను తీసుకునే పీఎస్ఏ ప్లాంట్‌ను ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన విషయం తెలిసిందే.



గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన

**మాతాశిశువు క్షేమం..**

మాతాశిశు విభాగంలో ఔట్ పేషెంట్లు 100 నుంచి 150 వరకు ఉంటున్నారు. రోజుకు డజను వరకు కాన్పులు చేస్తున్నారు. గర్భిణులకు ప్రతిరోజూ ఆరోగ్య తరగతులు ఉంటున్నాయి. ఆరోగ్యం, పోషకాహారం, వ్యాయామం, ముందు జాగ్రత్తలపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ప్రసవానంతరం తల్లీబిడ్డను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో క్షేమంగా ఇంటికి చేర్చుతున్నారు. ఎస్ఎస్‌సీయూ, నవజాత శిశు సేవలు, ఆరోగ్యశ్రీ సేవలను రోగులకు, అవసరమైనవారికి అందుతున్నాయి. ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో హెచ్‌ఐవీ రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు. డీఈఐసీ ద్వారా పిల్లలకు సేవలను ప్రతి మంగళ, శుక్ర వారాల్లో అందిస్తున్నారు. సదరమ్ క్యాంపుతో అర్హత కలిగిన దివ్యాంగులకు సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారు.

### క్వాలిటీ సర్టిఫికెట్ లభించింది...



వైద్య సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటంతో రోగుల సంఖ్య బాగా పెరిగింది. కేంద్ర బృందం రాష్ట్రంలోని వైద్య శాలల్లో అందుతున్న సేవలను పరిశీలించింది. ఈ క్రమంలో తెనాలి వైద్యశాలకు ఎన్‌క్యూఏఎస్ అండ్ లక్ష్య కార్యక్రమం ద్వారా గత మార్చిలో క్వాలిటీ సర్టిఫికెట్ కూడా లభించింది. ఆసుపత్రి పనితీరుకు ఇవి నిదర్శనాలు.

– డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్.

## వైభవంగా పేరంటాలమ్మ తిరునాళ్ల



శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

దావులూరు(కొల్లిపర): దావులూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాపమ్మ పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయం 518 ఏళ్ల చరిత్ర కలిగి, విశేష పూజలందుకుంటున్న దేవతగా పేరుగాంచిన తల్లి శ్రీ బాపమ్మ పేరంటాలమ్మ కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు.అధిక సంఖ్యలో మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. కుటుంబ సభ్యులతో పసుపు, కుంకుమలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయంలో అఖండ జ్యోతి, పంచామృతాలతో, రోకళ్లతో పూజ, గుమ్మడిశిడి, విగ్రహాల గ్రామోత్సవం , మేకశిడి వంటి వాటితో పాటు ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణతో తిరునాళ్లలో ప్రత్యేక సంతరించుకున్నాయి. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులు పశువులను, ట్రాక్టర్లను, పసుపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు బాగుండాలని అమ్మవారిని కోరుకున్నారు. గ్రామంలో, ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## నిబద్ధతతో పనిచేస్తే వైఎస్సార్ సీపీలో గుర్తింపు

**రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే**



మన్నవ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని నిబద్ధతతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన సమయంలో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్టీ నాయకుడు మన్నవ ప్రభాకర్ తాజా నియామకం ఇందుకు నిదర్శనమన్నారు. పట్టణంలోని చినరావూరుకు చెందిన మన్నవ ప్రభాకర్ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా గురువారం స్థానిక గంగానమ్మ పేటలోని పార్టీ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే శివకుమార్ ఘనంగా సత్కరించారు. పార్టీని నమ్ముకున్నవారిని మర్చిపోవటం అంటూ ఉండదనీ, కొంత ఆలస్యమైనా తప్పక న్యాయం జరుగుతుందని చెప్పారు. తొలి నుంచి పార్టీకి అండగా ఉంటున్న ప్రభాకర్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటానని ఈ సందర్భంగా మన్నవ ప్రభాకర్ అన్నారు. పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, మొగల్ అహ్మద్, నూర్ ఇస్మాయిల్, దుబాయ్‌బాబు, ఆవుల కోటయ్య, కె.ముక్తేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఎస్.రఘురామిరెడ్డి, కఠారి హరీష్, నాలాది ప్రభాకర్, మొగల్ అహ్మద్, కాకి దేవ సహాయం, మద్దాళి శేషాచలం, చుండూరు సాయి, రావి బ్రదర్స్, జాకీరా, ప్రియదర్శిని పాల్గొన్నారు.

**పవర్ లిఫ్టర్ షబీనాను సత్కరించిన ఎమ్మెల్యే**



షబీనాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

తెనాలి: కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలు, తమిళనాడులో నిర్వహించిన జాతీయ పోటీల్లో మూడు బంగారు, ఒక రజత పతకాన్ని సాధించిన తెనాలి పవర్ లిఫ్టర్ షేక్ షబీనాను స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సత్కరించారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతర్జాతీయస్థాయిలో పతకాలను సాధించిన షబీనా, భవిష్యత్‌లో కామన్‌వెల్త్, ప్రపంచ పోటీల్లోనూ పతకాలు సాధించాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవాలని సూచించారు. ఈ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. షబీనా భవిష్యత్‌లో మరింతగా రాణించాలని చెబుతూ, తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, షేక్ నూర్ ఇస్మాయిల్, మొగల్ అహ్మద్, పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, పార్టీ నాయకులు కాకి దేవ సహాయం, మద్దాళి శేషాచలం, చుండూరు సాయి, టెక్స్ బాల, జకీరా, అక్కిదాసు కిరణ్, రఫీ ప్రభృతులు పాల్గొన్నారు.

## ప్రజా చైతన్యం 'ఇప్టా' ఆశయం

**ఆవిర్భావ సభలో బొల్లిముంత కృష్ణ**



తెనాలి: ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇప్టా) ఆవిర్భావ సమావేశాన్ని గురువారం సాయంత్రం స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. విజ్ఞానం కోసం, ప్రజా చైతన్యం కోసం అనే లక్ష్యంతో ఇప్టా ఆవిర్భవించినట్టు గుర్తుచేశారు. ఆవిర్భావం నుంచి నేటి వరకు నాటక, నాటిక, పాటలు, జానపద కళారూపాలతో ప్రజా చైతన్యం కోసం కృషిచేస్తోందని చెప్పారు. కేఏ అబ్బాస్, పృథ్వీరాజ్ కపూర్, కేఏ ఆజ్మీ, బలరాజ్ సహానీ, సలీల్ చౌదరి వంటి ప్రముఖులు జీవితాంతం ఇప్టా కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసినట్టు తెలిపారు. మహానటి షబనా ఆజ్మీ ఇప్పటికీ తన కృషిని కొనసాగిస్తున్నట్టు గుర్తుచేశారు. సంస్థ తెనాలి అధ్యక్షుడు బెల్లంకొండ వెంకట్ అధ్యక్షత వహించారు. 'ఇస్కఫ్' జిల్లా కార్యదర్శి ఎం.శ్రీకాంత్ స్వాగతం పలికారు. గాయకులు టీఎంజే మోహనరావు, బి.శివశ్రీనివాసరావు, శ్రీదేవి, రత్నకుమారి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగనన్నది జనరంజక పాలన

**గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్**



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పారదర్శక సంక్షేమ పాలనను ప్రజలు సంపూర్తిగా స్వాగతిస్తున్నారని, జగనన్నది జనరంజక పాలన అంటూ సామాన్యులే కొనియాడుతున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో గురువారం నిర్వహించారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరిగి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. వారికి నాలుగేళ్లలో అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. కేవలం ఒక అంగలకుదురు గ్రామంలోనే నాలుగేళ్లలో రూ. 21 కోట్ల సంక్షేమ లబ్ధిని ప్రజలకు అందించినట్టు తెలిపారు. గ్రామంలో 140 మందికి ఏటా ఈబీసీ నేస్తం కింద ఆర్థిక సాయం అందుతోందని చెప్పారు. గత ఎన్నికలకు ముందు గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమం చేపట్టి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తిరిగానని గుర్తుచేశారు. అప్పట్లో ప్రజలకు చెప్పిన విధంగానే నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సంక్షేమ లబ్ధిని పొందుతున్న ప్రతి కుటుంబంలో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నేత కావూరు కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.




## సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు ఒక విప్లవం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ పద్మావతి

తూములూరు(కొల్లిపర): పాలనలో సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు ఒక విప్లవమని ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. తూములూరు గ్రామంలో మర్రెడ్డి కల్యాణ మండపంలో అన్నవరం, బొమ్మువానిపాలెం, చక్రాయపాలెం, దావులూరు, తూములూరు గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ పద్మావతి పాల్గొని, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, సర్పంచులతో కలిసి వలంటీర్లకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చే క్రమంలో సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు రెండు కళ్లుగా పనిచేస్తున్నాయని కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. కరోనా కష్ట కాలంలోనూ ప్రాణాలకు తెగించి, వలంటీర్లు అందించిన సేవలు చాలా గొప్పవన్నారు. అనంతరం 105 మంది వలంటీర్లలను ఘనంగా సత్కరించారు. తూములూరు సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి తూములూరు సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్, ఉప సర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, దావులూరు సర్పంచ్ సంధ్యారాణి, మండల ఉపాధ్యక్షులు2 అద్దంకి బోసుబాబు, తూములూరు ఎంపీటీసీలు 1, 2 మర్రెడ్డి మాధవి, అవుతు బసవ పున్నారెడ్డి, బొమ్మువానిపాలెం ఎంపీటీసీ తుమాటి భీమారాణి, పార్టీ నాయకులు, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్ , సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బైకులు ఢీకొని నలుగురికి గాయాలు



కర్లపాలెం:రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడంతో నలుగురుకి గాయాలైన ఘటన బుద్దాంలో గురువారం చోటు చేసుకుంది. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరం గ్రామానికి చెందిన ఆసోది కార్తీక్ ద్విచక్ర వాహనంపై బాపట్ల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుద్దాం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ప్రొక్లెయిన్‌ను దాటి వెళ్లే క్రమంలో తన బైకును ఢీకొట్టినట్లు కార్తీక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో కార్తీక్‌తో పాటు మరో బైక్‌పై ఉన్న భార్యభర్తలు, చిన్నారికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహితకు వేధింపులు భర్తపై దాడి.. మూడేళ్ల జైలు

తెనాలిరూరల్: ఓ వివాహితతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఆమె భర్తపై దాడి చేసి, గాయపరిచిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలేనికి చెందిన వివాహితను అదే ప్రాంతానికి చెందిన కూకట్లపల్లి వెంకట మణికంఠ వేధించేవాడు. గతేడాది జూన్ 1న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. 2 వ తేదీ తెల్లవారుజామున వివాహిత ఇంటికెళ్లి తలుపు తట్టాడు. ఆమె భర్త తలుపు తీయడంతో.. అతనిపై రాయి, ఇనుప రాడ్డుతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కేసు గురువారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాలని ఉత్తర్వులిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ జె.ఎలిజిబెత్ రాణి వాదనలు వినిపించారు.

## వేడుకగా గుండి పార్వతి గ్రామోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలోని గుండి పార్వతీ అమ్మవారి తిరునాళ్ల గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు భట్టిప్రోలు కార్తికేయ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఘటంతో గ్రామోత్సవం కావించారు. భక్తులు పసుపు బండ్లు తీసుకువచ్చి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భట్టిప్రోలు గ్రామ దేవత దండి పార్వతీ అమ్మవారి సహోదరి గుండి పార్వతీ అమ్మవారికి ఏటా ఘనంగా పూజలు నిర్వహిస్తుంటారు. శుక్రవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, భక్తులు ప్రభలను కట్టుకుని అమ్మవారి సన్నిధికి తీసుకు వస్తారు. మొక్కలు చెల్లించుకోనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.